www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 సోమవారం

# వెలుతురు

రంగారెడ్డి। 12, ఫిబ్రవరి 2024

తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 264, పేజీలు: 12, వెల: రూ.5/-



# 370 దాటేస్తాం!

- మాకు 400 ఎంపీ సీట్లు వస్తాయని విపక్షాలే అంటున్నాయి: మోదీ
- కాంగ్రెస్ అధికారంలో ఉంటే దోపిడీ
- బయట ఉంటే కులమతాల చిచ్చు: ఝాబువా సభలో ప్రధాని

ఝాబువా, ఫిబ్రవరి 11(వెలుతురు): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 సీట్లకు పైగా గెలుస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తంచేశారు. పార్లమెంటులో విపక్ష నేతలు సైతం ఎన్డీయేకి ఈ దఫా 400 స్థానాలకు మించి వస్తాయని చెబుతున్నారని గుర్తుచేశారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ఝాబువాలో గిరిజనులతో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో గత ఎన్నికల్లో బీజేపీకి వేసిన ఓట్ల కంటే అదనంగా మిగతా.. 2లో

## నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (వెలుతురు): కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై సోమవారం చర్చ జరగనుంది. రూ.2,75,891 కోట్లతో ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా, ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలు, వాటికి చేసిన కేటాయింపులపైనే అసెంబ్లీలో చర్చ జరగనున్నట్లు సమాచారం. పథకాల అమలుకు నిధుల కేటాయింపులు సక్రమంగా జరగలేదని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆరోపిస్తున్నారు. సరిపడే నిధులు లేకుండా పథకాలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాలపైనే ప్రభుత్వాన్ని నిలదీయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఉన్నట్లు సమాచారం. దీంతో వారికి దీటుగా సమాధానం చెప్పేందుకు కాంగ్రెస్ నేతలు సన్నద్ధమవుతున్నారు.


## 395 మంది ఎంపీడీవోల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఈసీ మార్గదర్శకాల నేపథ్యంలోనే..

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (వెలుతురు): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో) బదిలీలు భారీగా జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 612 మంది ఎంపీడీవోలు ఉండగా.. వీరిలో 395 మందిని బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మిగతా.. 2లో

# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్!

- సీఎంను కలిసిన బొంతు రామ్మోహన్
- త్వరలో కాంగ్రెస్‌లోకి గ్రేటర్ మాజీ మేయర్!
- మల్కాజిగిరి లోక్‌సభ టికెట్‌పై ఆసక్తి
- హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్
- ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లే లక్ష్యంగా పావులు



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (వెలుతురు): పార్లమెంటు ఎన్నికల ముంగిట ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మరో బిగ్‌షాక్. జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆ పార్టీని వీడి కాంగ్రెసలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వారం రోజుల్లో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకొంటారని సమాచారం. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని రామ్మోహన్ భావిస్తున్నట్లు, ఇదే విషయాన్ని సీఎం రేవంత్ వద్ద ప్రస్తావించగా.. ఆయన పరిశీలిద్దామని చెప్పినట్లు తెలిసింది. విద్యార్థి దశలో ఏబీవీపీలో, ఆ తరువాత బీజేవైఎంలో క్రియాశీలంగా వ్యవహరించిన బొంతు రామ్మోహన్.. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి టీఆర్ఎసలో చేరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలిచిన రామ్మోహన్‌కు మేయర్‌గా అవకాశం దక్కింది. కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న రామ్మోహన్.. 2018లో అసెం బ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించారు. ఇందుకు కేటీఆర్ హామీ ఇచ్చినప్పటికీ.. పార్టీ అధినేత కేసీఆర్.. భేతి సుభాషరెడ్డికి మిగతా.. 2లో



## బీహార్ అసెంబ్లీలో నేడు బలపరీక్ష

పాట్నా, ఫిబ్రవరి 11(వెలుతురు): జేడీయూ చీఫ్ నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి సోమవారం బీహార్ అసెంబ్లీలో బల పరీక్షను ఎదుర్కోబోతున్నది. ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు ఆర్జేడీ, జేడీయూ సహా వివిధ పార్టీలు వారిని గృహ నిర్బంధంలో ఉంచారని మీడియాలో వార్తలు వెలువడ్డాయి.

ఆదివారం పాట్నాలో ఏర్పాటు చేసిన పార్టీ ఎమ్మెల్యే సమావేశానికి ముగ్గురు జేడీయూ సభ్యులు గైర్హాజరవ్వటం కలకలం రేపింది. అయినప్పటికీ..నేడు జరగబోయే బలపరీక్షలో గెలుస్తామని సీఎం నితీశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మహాగట్‌బంధన్ మిగతా.. 2లో



## మార్స్‌పైకి 10 లక్షల మంది!

న్యూఢిల్లీ(వెలుతురు): ప్రముఖ బిలినియర్, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన చేశారు. అంగారక గ్రహం(మార్స్)పైకి 10 లక్షల మంది ప్రజలను తీసుకెళ్తామని, ఈ మేరక ప్రణాళికలు రచిస్తున్నట్టు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. అంగారకుడిపై నివసించేందుకు చాలా పనిచేయాల్సి ఉందన్నారు. 'స్టార్ షిప్ అతిపెద్ద రాకెట్ ఇది, ఇది మనల్ని మార్స్ వద్దకు తీసుకెళ్తుంది' అంటూ ఒక యూజర్ చేసిన పోస్టుకు మస్క్ స్పందించారు. అంగారకుడిపైకి వెళ్లే స్టార్‌షిప్‌ను ఎప్పుడు ప్రయోగిస్తారన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. 'ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లినట్టుగా.. ఒక రోజున మార్స్‌కు కూడా ట్రిప్ ఉంటుంది' అని పేర్కొన్నారు.





# లోక్‌సభ ఎన్నికల కోసమే కేసీఆర్.. నీళ్ల సెంటిమెంట్!

- ప్రాజెక్టులను బోర్డుకు ఇవ్వొద్దన్నదే మా విధానం
- గెజిట్‌కు బీఆర్ఎస్ సర్కారే అభ్యంతరం చెప్పలేదు
- బీఆర్ఎస్ పార్టీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- కేసీఆర్ నల్లగొండ సభకు ఒకరోజు ముందే
- అసెంబ్లీలో చర్చ చేపట్టాలని సర్కారు నిర్ణయం
- సమగ్ర అవగాహనతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిద్ధం
- అవగాహన సదస్సు నిర్వహించిన మంత్రి ఉత్తమ్
- 'కృష్ణా ప్రాజెక్టుల'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (వెలుతురు): రానున్న లోక్‌సభ ఎన్నికల కోసమే మాజీ సీఎం కేసీఆర్ నీళ్ల సెంటిమెంటును తెరపైకి తెచ్చారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టులను అప్పగించవద్దన్నదే ప్రభుత్వం విధానమని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు కేసీఆర్ ప్రభుత్వమే అభ్యంతరం చెప్పలేదన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని శాసనసభలో, బయటా తిప్పికొట్టాలని పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం సూచించారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత వ్యవహారంపై కేసీఆర్ మంగళవారం నల్లగొండలో సభ నిర్వహించనున్న నేపథ్యంలో.. అందుకు ఒకరోజు ముందే ఈ అంశంపై పార్టీని నేరుగా ఢీ కొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ప్రాజెక్టుల అప్పగింత విషయంలో ప్రభుత్వ విధానమేంటి? ఈ వ్యవహారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర ఏంటన్నది ప్రజలకు తెలియజెప్పాలని నిర్ణయించింది. ఇందుకోసం సోమవారం శాసనసభలో మిగతా.. 2లో



# మేడారంలో భక్త జన సందోహం

- వనదేవతల దర్శనానికి 10 లక్షల మందికి పైగా భక్తుల రాక



ములుగు, ఫిబ్రవరి 11 (వెలుతురు): మేడారం జాతర ఇంకా ప్రారంభం కాకముందే వనదేవతల దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు జాతర జరగనుంది. 2 నెలల ముందు నుంచే భక్తుల రాక మొదలవ్వగా.. జాతర సమీపిస్తుండడంతో తాకిడి రోజురోజుకి పెరిగి పోతోంది. ఆదివారం 10 లక్షల మందికిపైగా భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో వ్యాపారాలు చేసుకునేందుకు తెలుగు రాష్ట్రాల మిగతా.. 2లో

# ఢిల్లీకి దారి బంద్!

## డిమాండ్ల సాధన కోసం రేపు రైతన్నల 'ఢిల్లీ చలో' మార్చ్

- పాల్గొననున్న 200కుపైగా రైతు సంఘాలు
- ఢిల్లీ సరిహద్దుల్లో బారికేడ్లు ఏర్పాటు
- హర్యానా ప్రభుత్వం కఠిన చర్యలు
- 144 సెక్షన్.. ఇంటర్నెట్‌పై నిషేధం విధింపు



న్యూఢిల్లీ/చండీగఢ్, ఫిబ్రవరి 11 (వెలుతురు): అన్నదాతలు మరోసారి పోరుబాట పట్టారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతోపాటు తమ ఇతర డిమాండ్లు పరిష్కరించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు దాదాపు 200కు పైగా రైతు సంఘాలు ఈ నెల 13న(మంగళవారం) 'ఢిల్లీ చలో' మార్చ్ నిర్వహించ తలపెట్టాయి. ఈ నేపథ్యంలో మిగతా.. 2లో



# ఢిల్లీకి దారి బంద్!

(మొదటి పేజీ తరువాయి)
ఢిల్లీలోకి రైతులు ప్రవేశించకుండా అధికారులు సరిహద్దుల్లో అధిక బలగాలను మోహరించారు. సింఘూ, ఘాజీపూర్, టిక్రి సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. రైతులతో కూడిన వాహనాలు ఢిల్లీలోకి ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

రైతుల వాహనాలు పంక్చర్ అయ్యేలా పలు చోట్ల ఇనుప మేకులు కూడా ఏర్పాటు చేశారు. హర్యానా–ఢిల్లీ, యూపీ–ఢిల్లీ సరిహద్దుల్లో భద్రతా ఏర్పాట్లను ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా ఆదివారం పరిశీలించారు. రాజధానిలోకి ప్రవేశించే రోడ్లను బ్లాక్ చేసేందుకు పెద్ద కంటెయినర్లను తరలిస్తున్నారు. బస్సు, రైలు లేదా ఏ ఇతర మార్గంలోనూ రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా చూసేలా పలు బృందాలతో నిఘా పెట్టారు. ఈశాన్య డిల్లీలో 144 సెక్షన్ కూడా విధించి నిషేధ్నాలు అమలు చేస్తున్నారు. 'ఢిల్లీ చలో' ఆందోళనకు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ నుంచి పెద్దయెత్తున రైతులు వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు.

### హర్యానా-పంజాబ్ సరిహద్దు మూసివేత

మరోవైపు హర్యానాలోని ఖట్టర్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రైతులను నిలువరించేందుకు పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించింది. పంజాబ్ నుంచి రాష్ట్రంలోకి రైతులు ప్రవేశించకుండా సరిహద్దుల్లో సిమెంట్ బారికేడ్లు, ఇనుప కంచెలను సిద్ధం చేసింది. కొన్ని చోట్ల రోడ్లపై కొంత మంది ఇనుప మేకులను డ్రిల్లింగ్ చేస్తుండటం కనిపించిందని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. వాహనాలను అంబాలా నుంచి ఢిల్లీ వైపు వెళ్లనీయకుండా శంభు వద్ద హర్యానా–పంజాబ్ సరిహద్దును మూసివేశారు. ఆదివారం నుంచి మంగళవారం రాత్రి వరకు అంబాలా, కురుక్షేత్ర సహా ఏడు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్, బల్క్ ఎస్ఎంఎస్ సేవలపై ఆంక్షలు విధించారు. చాలా జిల్లాల్లో 144 సెక్షన్ విధించింది. ఢిల్లీకి సమీపంగా ఉండే సరిహద్దు సోనిపట్‌లో సీసాలు, ఇతర డబ్బాల్లో ఇంధనం నింపవద్దని ఆయిల్ బంకుల యాజమానులకు జిల్లా యంత్రాంగం సూచించింది. ట్రాకర్లకు ఇంధన ఫిల్లింగ్‌ను 10 లీటర్ల వరకే పరిమితం చేసింది.

### నేడు రైతు నేతలతో కేంద్రం చర్చలు

రైతు సంఘాల చలో ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో కేంద్రం రైతు నేతలను చర్చలకు ఆహ్వానించింది. సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపించేందుకు కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా, నిత్యానంద్ రాయ్ సోమవారం చండీగఢ్ రానున్నారని రైతుల నేత శర్వాన్ సింగ్ పంధేర్ పేర్కొన్నారు. మరోవైపు రైతులతో చర్చించాలని పంజాబ్ సీఎం మాన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంజాబ్, ఇండియా మధ్య సరిహద్దు నిర్మించొద్దని కేంద్రాన్ని కోరారు.

### రైతుల డిమాండ్లు ఇవీ:

పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత
స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు
రైతు రుణాల మాఫీ
రైతులు, వ్యవసాయ కార్మికులకు పింఛను
లఖింపూర్ బాధితులకు న్యాయం
రైతులపై కేసుల ఉపసంహరణ

# 370 దాటేస్తాం..!

(మొదటి పేజీ తరువాయి)
370 ఓట్లు వేయించాలని.. అప్పుడు తేలిగ్గా 370 స్థానాలు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ గిరిజనుల వ్యతిరేకి అని మండిపడ్డారు. గ్రామాలు, రైతులు, పేదలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఆ పార్టీకి గుర్తుకొస్తారని అన్నారు. 'అధికారంలో ఉంటే దోపిడీ చేయడం.. బయట ఉంటే కులం, మతం, భాష పేరిట విభజన చిచ్చు పెట్టడం దాని నైజం. తాను చేసిన పాపాల ఊబిలో తానే కూరుకుపోతోంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి' అని దుయ్యబట్టారు. ఝాబువాకు తాను ఎన్నికల ప్రచారం కోసం రాలేదని.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అద్భుత విజయం అందించినందుకు 'సేవకుడి'గా కృతజ్ఞతలు తెలియజేయడానికి వచ్చానని అన్నారు. 2047కల్లా దేశంలో..ప్రధానంగా గిరిజనుల్లో తలసేమియా వ్యాధి నిర్మూలన/నివారణకు చేపట్టిన జాతీయ మిషన్ గురించి చెబుతూ.. దీనిని ఎన్నికల కోసం ప్రారంభించలేదని.. గిరిజనుల ఆరోగ్యం కోసమే చేపట్టామని వివరించారు. 2014కి ముందువరకు కాంగ్రెస్ ఏలుబడిలో గిరిజనులకు దేశవ్యాప్తంగా వంద గురుకుల పాఠశాలలు మాత్రమే ఉండేవని.. గత పదేళ్లలో నాలుగు రెట్లకు పెంచామని చెప్పారు. కనీస మద్దతు ధర కల్పించే అటవీ ఉత్పత్తులను ఈ పదేళ్లలో పది నుంచి 90కి పెంచామని.. వన్ ధన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని.. 'జన్–మన్ యోజన' అమలు చేస్తున్నామని తెలిపారు. 'భూహక్కుల పరిరక్షణకు 1.75 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు 'స్వామిత్వ పత్రాలు' అందించాం. గిరిజనులకు భూహక్కులను తిరిగిచ్చాం' అని వివరించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం రెట్టింపు వేగంతో పనిచేస్తోందన్నారు. ఆదివారం ప్రారంభించిన రూ.7,550 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల గురించి ప్రధాని ప్రస్తావించారు. 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీలు'గా తయారుచేయడం తన గ్యారెంటీగా పేర్కొన్నారు. మహిళా రైతులకు డ్రోన్లు సమకూరుస్తామని.. వారంతా 'నమో డ్రోన్ దీదీలు'గా వ్యవసాయ విప్లవం తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

# 395 మంది ఎంపీడీవోల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)
ఎన్నికల కమిషన్ (ఈసీ) మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో కలెక్టర్లకు సూచించారు. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారితోపాటు మూడేళ్లకుపైగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని గత డిసెంబరులో ఈసీ అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వివిధ శాఖలు బదిలీలు చేపట్టాయి. తాజాగా ఎంపీడీవోలను బదిలీ చేశారు.

## లోక్‌సభ ఎన్నికల కోసమే కేసీఆర్..

# నీళ్ల సెంటిమెంట్!

(మొదటి పేజీ తరువాయి)
ఈ అంశంపై చర్చ చేపట్టనుంది. దీనికి పార్టీ ఎమ్మెల్యేలను సిద్ధం చేసేందుకు ప్రజాభవన్‌లో ఆదివారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించింది. కృష్ణానది పుట్టు పూర్వోత్తరాలు, నదిపై ఉన్న ప్రాజెక్టులు, వివాదాలు, నీటి వాటాలు తదితరాలపై మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత ప్రతిపాదన, దానిపట్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం, ఏపీ సీఎం జగన్‌తో కుదుర్చుకున్న అవగాహన వంటి వాటిని వివరించారు. అవగాహన సదస్సులో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. కాగా, శాసనసభలో సోమవారం చేపట్టనున్న చర్చలోనూ ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక కేసీఆర్ సభ జరిగే రోజు(మంగళవారం) ఎమ్మెల్యేలను ప్రభుత్వం ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డ పరిశీలనకు తీసుకువెళ్లనుంది. సదస్సు ముగిసిన అనంతరం ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణా జలాలకు సంబంధించి శాసనసభలో సోమవారం స్పష్టత ఇస్తామన్నారు. నల్లగొండలో కేసీఆర్ సభ ప్రారంభమయ్యే లోపునే తెలంగాణ ప్రజలకు నిజాలు చెబుతామన్నారు. తెలంగాణ నీళ్లను ఏపీ సీఎం జగన్ కోసం కేసీఆర్.. ఏపీకి తరలించారని ఆరోపించారు. ఈ విషయాన్ని జగనే ఏపీ అసెంబ్లీలో చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణకు ఉమ్మడి పాలకుల కంటే కేసీఆర్ చేసిన అన్యాయమే ఎక్కువన్నారు.




# ఢిల్లీలో కాంగ్రెస్ జెండా పాతుదాం: పొన్నం

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (వెలుతురు):**
వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్ జెండా పాతేందుకు సమాయత్తం కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు అమలు చేయలేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడించి ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలమూరు న్యాయ యాత్ర అదివారం రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం పెంజర్లలో కొనసాగింది. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం సమావేశంలో మాట్లాడుతూ.. పదవులు పోయాయన్న అక్కసుతో పసికూన వయసులోనే ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు మాటల దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉండగా బెంజ్ కార్లలో తిరిగిన నాయకులు.. ఇప్పుడేమో ఆటోలు ఎక్కుతూ డ్రామాలకు తెరతీస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా దశాబ్ద కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. తమ ఆకాంక్షలను నెరవేర్చని బీఆర్ఎస్, బీజేపీ నేతలను నిలదీయాలని ప్రజలకు పొన్నం పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల అధ్యయనానికే తాను న్యాయ యాత్ర చేపట్టినట్టు వంశీచంద్‌రెడ్డి తెలిపారు. కాగా, మైనింగ్ కాంట్రాక్టుల్లో వడ్డెర కులస్తులకు ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. వడ్డెరలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన వడ్డెరల ఆత్మగౌరవ సభలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, కర్ణాటక బీసీ సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ తంగ్డేలతో కలసి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. వడ్డెర వసతి గృహ నిర్మాణానికి తనవంతు సహకారమందిస్తామన్నారు. వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటుతో పాటు మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ విషయంలో సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. వడ్డెరలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. వడ్డెర సంఘం డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కర్ణాటకలో వడ్డెరులు ఎస్సీ జాబితాలో ఉన్నారని.. తెలంగాణలో వారిని ఎస్టీల్లో చేర్చాలని కర్ణాటక మంత్రి శివరాజ్ కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తానన్నారు.

# మేడారంలో భక్త జన సందోహం

(మొదటి పేజీ తరువాయి)
నుంచి వేలాది మంది తరలివచ్చారు. ములుగు మండలం జాకారం–భూపాల్‌నగర్ స్టేజీ మధ్య జరుగుతున్న రహదారి విస్తరణ పనుల వల్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆదివారం సాయంత్రం ఓ లారీ గుంతలో దిగబడడంతో దాదాపు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు.

### 23న సీఎం రేవంత్‌రెడ్డి రాక...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 23న మేడారం జాతరకు వచ్చి సమ్మక్క సారలమ్మను దర్శించుకుంటారని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. వనదేవతలను ఆదివారం దర్శించుకున్న మంత్రి సీతక్క జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కోటిన్నర మందికి పైగా భక్తులు జాతరకు వచ్చే అవకాశం ఉండడంతో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రపతి, గవర్నర్‌ను కూడా ఆహ్వానించామని వారు కూడా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతకు ముందు ఏటూరునాగారం మండలంలో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

## వేడుకగా నాగోబా జాతర

**ఇంద్రవెల్లి:** రాష్ట్రంలో రెండో అతి పెద్ద గిరిజన ఉత్సవం నాగోబా జాతర ఘనంగా జరుగుతోంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ప్రధాన ఆలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. జాతరలో మూడో రోజు, ఆదివారం... నాగోబా ప్రధాన ఆలయం వెనుక మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో పెర్సాపేన్, బాన్ దేవతలకు ప్రత్యేక పూజలు జరిగాయి. కొత్తగా బేటింగ్(పరిచయం) అయిన కోడళ్లు మర్రి చెట్టు వద్ద ఉన్న బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి బాన్ దేవత ఆలయం ముందు ఉన్న పాత పుట్టను తొలగించారు. మెస్రం వంశీయులు పాత భాన్ దేవతల ప్రతిమలను పవిత్ర జలంతో శుద్ధి చేశారు. కోడళ్లు కొత్త పుట్టలను తయారు చేసి భాన్ దేవతకు పూజలు చేశారు. ఇక, జాతరలో అత్యంత ప్రధానంగా భావించే గిరి దర్బార్ సోమవారం జరగనుంది.

# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్!

(మొదటి పేజీ తరువాయి)
టికెట్ ఇచ్చారు. తిరిగి ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉప్పల్ టికెట్ కోసం ప్రయత్నించగా.. ఆయనకు మరోసారి నిరాశే ఎదురైంది. దీంతో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనైనా మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో ఏదో ఒక చోట నుంచి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని రామ్మోహన్ కోరినట్టు తెలిసింది.

కానీ, ఇందుకు వారి నుంచి సానుకూల సంకేతాలు రాలేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆయన కాంగ్రెసలో చేరేందుకు సిద్ధమయ్యే సీఎం రేవంత్‌ను కలిసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ కాంగ్రెసలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుత మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూడా ఇటీవల సీఎంను కలిశారు. పాలనాపరమైన అంశాల కోసమేనని ఆమె చెప్పినప్పటికీ.. తాజా పరిణామాల నేపథ్యంలో మేయ ర్ అడుగులు ఎటువైపు? అన్న చర్చ కూడా జరుగుతోంది. మరోవైపు ప్రస్తుత డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి దంపతులూ పార్టీని వీడుతారన్న ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన కాంగ్రెస్ పార్టీకి జీహెచ్ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కటి కూడా దక్కని విషయం తెలిసిందే. దీంతో లోక్‌సభ ఎన్నికల నాటికి గ్రేటర్‌లో పార్టీ బలోపేతం లక్ష్యంగా కాంగ్రెస్ ఆపరేషన్‌ఆకర్ష్‌కు తెర తీస్తోం ది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లను చేర్చుకోవ డంపై దృష్టి సారించింది. ఇప్పటికే 14 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పార్టీ నేతలు సంప్రదింపులు జరిపినట్టు సమాచారం.

# బీహార్ అసెంబ్లీలో నేడు బలపరీక్ష

(మొదటి పేజీ తరువాయి)
(ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్)), ఎన్డీయే కూటమి మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఆర్జేడీ ఎమ్మెల్యేలందర్నీ తేజస్వీ యాదవ్ గృహ నిర్బంధంలో ఉంచారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఇది పూర్తిగా అవాస్తమని చెబుతూ ఆర్జేడీ..సోషల్‌మీడియాలో ఓ వీడియోను విడుదల చేసింది. గత కొన్ని రోజులుగా గయలోని మహాబోధి రిసార్ట్‌లో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు బయటకు వచ్చారు. ఆదివారం ప్రత్యేక బస్సులో పాట్నాకు చేరుకున్నారు. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 122 మంది సభ్యుల బలం అవసరం. బీజేపీ–78, జేడీయూ–45, హెచ్ఏఎం(ఎస్)–4, ఐఎన్డీ–1లతో కూడిన ఎన్డీయే కూటమికి మొత్తం 128 మంది ఎమ్మెల్యేల బలమున్నట్టు సమాచారం. మహాగట్‌బంధన్ పేరుతో ఒక్కటైన ఆర్జేడీ–79, కాంగ్రెస్–19, సీపీఐ(ఎంఎల్)–12, సీపీఎం–2, సీపీఐ–2, ఇతరులు–1, ఏఐఎంఐఎం–1.. కూటమికి 114 మంది ఎమ్మెల్యేల మద్దతుంది.



# నిఘా నీడలో పీఎన్‌ఆర్ నగర్ కాలనీ

**మేడిపల్లి, వెలుతురు:**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని 16వ డివిజన్ పీఎన్‌ఆర్ కాలనీలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఈ మేరకు ఆ కెమెరాలను మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి దగ్గరుండి ప్రారంభించారు.. ఈ సందర్భంగా కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు శాంతి భద్రతలను కాపాడడంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయని అన్నారు.. నేరాలను అరికట్టడంలోనూ నేరస్తులను త్వరితగతన గుర్తించి వారికి శిక్ష పడే కార్యక్రమంలో సీసీ కెమెరాలు ప్రధాన భూమిక వహిస్తున్నాయని వెల్లడించారు.. సీసీ కెమెరాల ప్రాముఖ్యత తెలియజేస్తూ వాటి ఉపయోగాలను వివరించి స్థానికులకు అవగాహన కల్పించారు కిషోర్ గౌడ్.. కాలనీలోని ప్రతి ఒక్కరూ వారి ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా కోరారు. కాలనీలో సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన కొత్త కిషోర్ గౌడ్ కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్, 16వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ దిలీప్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ అశోక్ యాదవ్, శ్రీనివాస్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

## - మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి(వెలుతురు న్యూస్):**
విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని, అప్పుడే జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. ఆదివారము వికారాబాద్ పట్టణంలోని యునైటెడ్ స్కూల్ ఆధ్వర్యంలో బ్లాక్ గ్రౌండ్లో నిర్వహించిన అన్యువల్ స్పోర్ట్స్ డే కార్యక్రమానికి చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్న యునైటెడ్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. మరి ముఖ్యంగా మైనారిటీలలో నలుగురు పిల్లలు ఉంటే కేవలం ముగ్గురికి మాత్రమే ఫీజు తీసుకొని ఒకరికి ఉచితంగా విద్య అందించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చైర్ పర్సన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజలతో సత్ప్రవర్తనతో మెలగాలి

## రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా..

## కరణ్ కోట్ ఎస్ఐ విఠల్ రెడ్డి...


**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
సమాజంలో అందరు సత్ప్రవర్తనతో మెలగాలని తాండూరు సబ్ డివిజన్ కరణ్ కోట్ ఎస్ఐ విఠల్ రెడ్డి సూచించారు. ఆదివారం కరణ్ కోట్ పోలీస్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లతో ఎస్ఐ విఠల్ రెడ్డి సమావేశం నిర్వహించారు. వాళ్లతో మాట్లాడి ప్రస్తుత జీవన శైలి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లుగా పేరు మోపబడిన వారు సమాజంలో సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. గతాన్ని పూర్తిగా మరిచిపోవాలని, అందరి పట్ల స్నేహ పూర్వకంగా ఉండాలన్నారు. అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మీ అందరిపై పోలీసుల నిఘా ఉంటుందని, శాంతి భద్రత విషయంలో పోలీసులకు సహకారం అందించాలన్నారు.

# ఉల్లిగడ్డల స్మగ్లింగ్.. కోట్లలో దందా

**ముంబై (వెలుతురు న్యూస్):** చెన్నై, ముంబై, బీహార్ నుంచి బంగ్లాదేశ్, దుబాయ్, శ్రీలంక తదితర దేశాలకు ఉల్లిగడ్డల స్మగ్లింగ్ జరుగుతున్నట్టు తెలుస్తున్నది. భారత్‌లో మినహా ఇతర దేశాల్లో కిలో ఉల్లిగడ్డ వెయ్యి రూపాయలు పైనే ఉండటంతో స్మగ్లర్లు అక్రమ రవాణాకు తెగించారు. రోజూ ఉల్లిని అక్రమంగా తరలిస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. క్వింటాలుకు రూ.వెయ్యి చొప్పున ఉల్లిని కొనుగోలు చేసి.. విదేశాలకు రూ.9–10 వేల వరకు విక్రయిస్తున్నారు. దేశం నుంచి రోజూ 10–12 కంటైనర్లలో 300 టన్నుల ఉల్లి అక్రమ రవాణా అవుతున్నది. ఈ రాకెట్‌లో కొందరు కస్టమ్స్ అధికారుల పాత్ర ఉన్నట్లు తెలుస్తున్నది. ఉల్లిగడ్డల ఎగుమతుల లావాదేవీలన్నీ హవాలా మార్గంలో జరుగుతున్నట్లు సమాచారం. నాసిక్‌లోని మాలేగావ్, ముంగ్సే, లాసల్ గావ్, పింపాల్ గావ్‌ల నుంచి ఈ రాకెట్‌ను నడుపుతున్నారు.

# నవాబుపేట్ మండలంలో ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**నావాబు పేట్ (వెలుతురు న్యూస్):**
ఆర్టీసీ బస్సు మరియు బైక్ ఢీకొన్న సంఘటన నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే పులుమద్ది గ్రామాని వికారాబాద్ మండలం కి చెందిన బిల్లాపాటి బీరయ్య తండ్రి మాణాయ్య వయసు 35 సంవత్సరాలు వృత్తి వ్యవసాయం వికారాబాద్ నుండి తన బైకు TS34J2950 పై నవాబ్ పేట్ వెళ్తుండగా మార్గమధ్యంలో ఎక్మామిడి మసీదు దగ్గర తనకి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు AP29Z3277 ఢీకొని కిందపడి రక్త గాయాలు కాగ తన కుటుంబ సభ్యులు మరికొందరు వ్యక్తులు కలిసి 108 అంబులెన్స్ లో వికారాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ కి పంపగా మెరుగైన చికిత్స కై ఉస్మానియా జనరల్ హాస్పిటల్ హైదరాబాద్ కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తేదీ 10.02.2024 రాత్రి 08.00 గంటలకు మరణించినాడని మృతుడి భార్య బిల్లపాటి మంజుల ఫిర్యాదు చేయగా నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు అయింది.



# చేనేతను ఆదుకుంటాం... పూర్వ వైభవం తీసుకొస్తాం...

**- తుమ్మల నాగేశ్వరరావు**



- అందర్నీ కలుపుకొని ముందుకెళ్లాలి: కందగట్ల స్వామి
- చేనేత పథకాలు పునరుద్ధరించాలి: గడ్డం జగన్నాథం
- చేనేత సమస్యలపై త్వరలో సమావేశం ఏర్పాటు చేయండి:బీ ఎల్ రమణ
- సమాజమంతా ఏకం కావాలి: రాపోలు ఆనంద భాస్కర్
- నూతన నాయకత్వాన్ని పెంపొందించాలి: ఇరావతి అనిల్
- కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి: వన్నాల శ్రీరాములు

**హైదరాబాద్, వెలుతురు, ఫిబ్రవరి 11:**
గత ప్రభుత్వానికి భిన్నంగా చేనేత కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని కేంద్ర రాష్ట్ర పథకాలన్నీ చేనేతలకు పంపిణీ చేసేందుకు కృషి చేస్తానని అసంపూర్తిగా ఉన్న చేనేత సమస్యలపై దృష్టి సారించి పూర్వ వైభవం తీసుకొస్తానని రాష్ట్ర చేనేత జౌళి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

ఆదివారం హైదరాబాద్ నారాయణగూడ పద్మశాలి భవన్లో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం



నూతన అధ్యక్ష కార్యదర్శులు ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు చేనేత కార్మికుల సమస్యలపై త్వరలో సంఘ నాయకులతో సమావేశం నిర్వహించి వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు నూతనంగా ఎన్నికైన సమర్థపు మురళి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు తెలంగాణ ప్రభుత్వం చేనేత సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు చేనేత కార్మికుల సమస్యలను చిన్ననాటి నుండి స్వయంగా చూశానన్నారు దేశంలో రైతుల తర్వాత అతిపెద్ద పరిశ్రమ చేనేత రంగమని అన్నారు అన్ని రంగాలలో పద్మశాలీలు రాణించాలని వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు గద్వాల పోచంపల్లి గద్వాల పోచంపల్లి తదితర ప్రాంతాలలో ఉన్న చేనేత పార్కులను సందర్శించి అభివృద్ధి పరుస్తామని అన్నారు భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి మాట్లాడుతూ. పద్మశాలి కుల బంధువులందరినీ కలుపుకొని ముందుకెళ్లాలని, నూతన కార్యవర్గానికి సూచించారు. లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధన కోసం సంఘ పటిష్టత కోసం సంఘ ప్రతినిధులు అనునిత్యం కృషి చేయాలన్నారు 100 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న పద్మశాలి సంఘం. పద్మశాలీల సంక్షేమం కోసం విశేష కృషి ఉందన్నారు దేశవ్యాప్తంగా సంఘం ధ్రుడంగా ఉందన్నారు, దేశవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా యువజన సంఘాల ఏర్పాటుతో సంఘాన్ని పటిష్ట పరుస్తున్నామన్నారు. పనిచేసే నాయకులు సంఘంలో చేరి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కందగట్ల స్వామి పేర్కొన్నారు. పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం మాట్లాడుతూ... చేనేత పథకాలను పునరుద్దరించలని పేర్కొన్నారు. మనిషి తినాడనికి ఎంతైతే ఖర్చు చేస్తున్నాడో అంతే ఖర్చు బట్టకు చేస్తున్నారు, ఇంత ప్రాముఖ్యత గల వస్త్ర పరిశ్రమను కెంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నయని ఆవేదన వ్యక్తం చేశారు అత్యధికంగా పత్తిని పండించే భారతదేశంలో వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలు లేక పండిన పత్తి బేళ్లను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని అన్నారు ఇప్పటికైనా వస్త్ర పరిశ్రమపై దృష్టి సారించాలని ఈ రంగంపేట కార్మికుల ఆదుకోవాలని కోరారు భారతదేశంలో ఏ మూలకెళ్లిన తెలంగాణ మూలాలు గల చేనేత కార్మికుల ఉంటారని ఈ తెలంగాణ చేనేత కార్మికుల వలసలకు నిలయమైందన్నారు పద్మశాలి కులాన్ని యూనిట్గా తీసుకొని సంక్షేమ పథకాలు అందించాలని ఐదు శాతం ఉన్న చేనేత కార్మికులను అందించే సంక్షేమ పథకాలు మొత్తం పద్మశాలి సమాజానికి అందించిన విధంగా ప్రభుత్వాలు చెబుతున్నాయని ఈ విధంగా కాకుండా కులాన్ని యూనిట్గా తీసుకొని సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ చేనేత సమస్యలపై త్వరలో అఖిలపక్షాన్ని పిలిచి సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు 100 సంవత్సరాల చరిత్ర ఉన్న పద్మశాలి సంఘం అను బంధంగా ఉన్న తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘానికి యువ కుడు అధ్యక్షుడు కావడం మురళి అదృష్టంగా భావించాలన్నారు ఈ సంఘ అభివృద్ధికి వంద శాతం మా వంతు సహకారం ఉంటుందన్నారు.

మంత్రి తుమ్మల తుమ్మలతో తనకున్న అనుబంధం చాలా ఏళ్ల నుంచి వారి సహకారంతో చేనేత కార్మిక సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు పద్మశాలి కుల బంధువులందరికీ చూస్తే చాలా సంతోషంగా అనిపిస్తుంది, కందగట్ల స్వామి గారి నేతృత్వంలో భారత దేశ జాతి ఏకీకరణ విశిష్ట కృషి చేస్తున్నారు నూతన రాష్ట్ర అధ్యక్షుడు కూడా ఆయనను అనుసరిస్తూ ముందుకు వెళ్లాలని రమణ సూచించారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ మాట్లాడుతూ సమాజమంతా సమిష్టిగా ఏకతాటిపైకి వచ్చి ముందుకు సాగాలని కోరారు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ నూతన అధ్యక్షుడు యువ నాయకత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు రాష్ట్ర ప్రభుత్వం నేత అన్నలకు అన్నివేళలా మంత్రిగారి సహకారంతో అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పొన్నాల శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న చేనేత పథకాలను అందరికీ అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కృషి చేయాలని కోరారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కమర్తపుమురళి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొంటు సంఘ నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

తనకు ఇచ్చిన అవకాశాన్ని ఒక బాధ్యతగా తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలీల ఐక్యతకు చేనేత సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి ఆదేశాలను అనుసరిస్తూ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘన్ని రాష్ట్ర జిల్లా మండల గ్రామ అమలలో విస్తృత పరుస్తానని పేర్కొన్నారు. చేనేత పద్మశాలి సంఘ అభివృద్ధికి మంత్రి సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. చేనేతల సమస్యల గురించి మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి నాలుగు కోట్ల 52 లక్షల రూపాయలు మంజూరు చేశారని పేర్కొన్నారు, ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.. రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్ రావు , రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా వారికి 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి యువజన విభాగం జాతీయ ఇన్చార్జ్ అవ్వారి భాస్కర్, మహిళ విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతల, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు పుట్ట పాండు రంగయ్య, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళీ, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రమ్, గౌరవ అధ్యక్షులు మేతుకు సత్యం, తెలంగాణ పద్మశాలి యువ జన విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షులు గుంటుక రూప, గ్రేటర్ అధ్యక్షులు కత్తుల సుదర్శన్, గ్రేటర్ యువజన అధ్యక్షుడు గుర్రం శ్రవణ్, మహిళా విభాగం అధ్యక్షురాలు పొరండ్ల శారద, బొమ్మ ప్రవలిక, తెలంగాణ మీడియా విభాగం అధ్యక్షుడు బొమ్మ అమరేందర్, బురం శంకర్ తదితరులు పాల్గొన్నారు.





# మాతృ శక్తిని చాటి చెప్పాలి

**-పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారు...**

**మహిళా శక్తి సమ్మేళన సమితి రాష్ట్ర బాధ్యులు, సామాజిక కార్యకర్తలు లింగం ఉజ్వల, జొన్నలగడ్డ నాగశ్రీ శారదాంబ....**

**ప్రధాన వక్త కొంపెల్లి మాధవీ లతల వ్యాఖ్యలు...**

**కరీంనగర్, వెలుతురు ఫిబ్రవరి 11:**
కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లిలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో మహిళా శక్తి సమన్వయ సమితి కరినగరము విభాగ్ మహిళా శక్తి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య వక్తలు హాజరైన మహిళా శక్తి సమ్మేళన సమితి రాష్ట్ర బాధ్యులు, సామాజిక కార్యకర్తలు లింగం ఉజ్వల, జొన్నలగడ్డ నాగశ్రీ శారదాంబ, ఆధ్యాత్మిక వేత్త మాధవీ లత లు మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. ప్రధానంగా ప్రాచీన కాలంలో పురుషులతో సమాన స్థాయి కలిగి ఉన్న భారతీయ మహిళలు మధ్యయుగంలో అధమ స్థాయికి అనచబడ్డారన్నారు. దీంతో అనేకమంది సంఘసంస్కర్తలు మహిళల సమాన హక్కుల కల్పన కోసం కృషి చేశారన్నారు. నేటి కాలంలో మహిళలు ఇంటి నుండి బయటకు వచ్చి వారి సమస్యలను అధిగమించి ఇష్టమైన రంగాల్లో తమ ప్రతిభతో రాణిస్తున్నారని, వీరు చరిత్రను లిఖించడమే కాకుండా ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళా శక్తిని చాటి చెప్పాలన్నారు .మహిళలు చైతన్యం కలిగించడం ద్వారా భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను పరిరక్షించడం, దేశ సమగ్ర అభివృద్ధిలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచడం, వివిధ రంగాల్లోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కార మార్గమును కనుగొనటం, మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం అనే ఉద్దేశంతో మహిళా శక్తి సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా మహిళల్లో చైతన్యం కల్పించడం కోసం ఇట్టి కార్యక్రమం ఎంతో దోదపడుతుందన్నారు. సమాజంలో మహిళ పాత్ర కీలకంగా ఉందని, మహిళలు ప్రధానంగా తమ పిల్లలను సమాజానికి పనికొచ్చే విధంగా ప్రయోజకులను చేయాలనే లక్ష్యం , చైతన్యం కలిగి ఉండాలన్నారు. మహిళా శక్తి సమ్మేళన కార్యక్రమం లాంటివి మహిళలను చైతన్య పరచడమే కాకుండా, వారిలోఅంతర్గతంగా ఉన్న సృజనాత్మక ను వెలికి తీసేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఇట్టి సమ్మేళనం సందర్భంగా పలు అంశాలపై చర్చ కార్యక్రమం జరిగింది. అనంతరం మరో వక్త, ఆధ్యాత్మికవేత్త కొంపెల్లి మాధవి లత ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ సృష్టిలో స్త్రీ శక్తి అపూర్వమని అన్నారు. ప్రతి స్త్రీలో ఉన్న మాతృత్వాన్ని జాగృతం చేయాలని చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రధాన సంరక్షకులు స్త్రీలే అని కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలోప్రభుత్వ ,పారిశ్రామిక ,సామాజిక సేవ ,విద్యా , వైద్యరంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ మహిళలలు, ముఖ్య అతిథులు డాక్టర్ శేష శైలజ , బొడ్ల గీతారాణి, కోడూరి శ్రీవాణి, లెక్కల గీతారెడ్డి పాటు మహిళా శక్తి సమ్మేళనం కరీంనగర్ విభాగ్ స్వాగత సమితి బాధ్యులు డాక్టర్ ఆకుల శైలజ, ముక్క రాజ శ్రీ, డాక్టర్ నందికొండ శ్రీ లక్ష్మీ రెడ్డి, కంజర్ల శ్రీలత, డాక్టర్ అన్ని తిరుమల సరిత, ముక్క స్వప్న, డా.దేవరకొండ శశి ప్రభ, రాహుల అపర్ణ నరేష్, కనికరం శ్రావ్యా రాణి, దుల్గుంటి సుష్మ, మందల అనిత, భోగ పుష్పలత, నాలకొండ సుమలత, మంజుల, సంధ్యారేఖ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పీవీ నరసింహారావుకు భారతరత్న దక్కడం హర్షనీయం

**- పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు చంద్రారెడ్డి**



**కూకట్పల్లి, వెలుతురు:**
భారతదేశానికి ప్రధానమంత్రిగా అనేక సేవలు అందించిన దివంగత నేత పివి నరసింహారావుకు భారతరత్న దక్కడం హర్షనీయమని కూకట్పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పీవీ నరసింహారావు తన చాతుర్యంతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారన్నారు. కేంద్ర ప్రభుత్వం పీవీ సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించడం తెలుగు ప్రజలందరికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. దేశానికి చేతనైన సేవచేసై అత్యున్నత పురస్కారాలు పొందుతామని పీవీ నరసింహారావు నిరూపించి భావితరాలకు ఆదర్శంగా నిలిచారని, ఆయన అడుగు జాడల్లో నడవడం మనందరి బాధ్యత అని చంద్రారెడ్డి తెలిపారు. పీవీకి భారతరత్న ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి చంద్రారెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు

**గన్నేరువరం, వెలుతురు, ఫిబ్రవరి 11:**
మండలంలోని జంగపల్లి గ్రామ పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు గుంటుక లింగయ్య ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనం ఎత్తుకొని డప్పుచప్పులతో శివసత్తుల పూనకాలతో బయలుదేరి అమ్మ



వారికి భక్తి శ్రద్ధలతో నైవేద్యం, పసుపు, కుంకుమ, ఓడి బియ్యం సమర్పించి సల్లగా చూడు తల్లి అని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గుంటుక లింగయ్య మాట్లాడుతూ జంగపల్లి గ్రామంలో ఈ నెల 26 నుండి శ్రీ భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో కుల సంఘాలను కలుపుకొని కార్యక్రమం చేపడతామన్నారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మురారి, భూ శంకర్, రవీందర్, కేశవులు, ఆంజనేయులు, చక్రపాణి, అశోక్, పరమేశ్వర్, నరేందర్, శ్రీనివాస్, సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# బర్దిపుర్లో ఉర్స్ ఉత్సవంలో పాల్గొన్న మాజీ డాక్టర్ ఏచంద్రశేఖర్

**జహీరాబాద్, 11 ఫిబ్రవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ గ్రామంలోనీ పురాతన స్వయంభుగ వెలసిన హజరత్ షానూరే ఇమామ్ దర్గా గంధం



ఉత్సవాలలో మాజీ మంత్రి జహీరాబాద్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ చంద్రశేఖర్ పాల్గొని దర్గాని దర్శించుకోని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు వారిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజక వర్గానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రజాదర్బార్ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్

**జహీరాబాద్, 11 ఫిబ్రవరి, వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహిరాబాద్ పట్టణంలోని ఫయాజ్ నగర్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు గౌసోద్దీన్ అధ్యర్యంలో ఆదివారం మాజీ మంత్రి వర్యులు జహీరాబాద్ చీఫ్ కోఆర్డినేటర్



డాక్టర్ ఏ చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా దర్బార్ కార్యాలయాన్ని ప్రారంబించారు. అనంతరం వారు కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ కాలనీ వాసులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని అలాగే కాంగ్రెస్ పార్టీ చెప్పట్టబోయే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు.

కాలనీ వాసులు ప్రజా దర్బార్ కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యుఏఈలో నరేంద్రమోడికి తెలుగోడి సాహసోపేతమైన స్వాగతం

## హిందూవాహిని కార్యకర్త నాగిళ్ల శ్రీకాంత్ గౌడ్

**నంగునూర్ మండలం, వెలుతురు ఫిబ్రవరి11:**
అయోధ్యలో భవ్య రామమందిర ప్రారంభం అట్టహాసంగా జరిగింది. ఇప్పుడు మరో వేడుకకు హిందూ సమాజం సిద్ధమవుతోంది. మధ్యప్రాచ్యంలోనే అతిపెద్ద హిందూ దేవాలయంగా గుర్తింపు పొందుతున్న బోచసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయన్ (BAPS) ఆలయం ప్రారంభానికి సిద్ధమైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అబుదాబి నగరంలో నిర్మితమవుతున్న ఈ ఆలయం ఫిబ్రవరి 14 2024న ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ప్రారంభం కాబోతోంది. అబుదాబి ఆలయం అరబ్ దేశాల్లో అతిపెద్ద మందిరంగా మిడిల్ ఈస్ట్‌లోనే అతిపెద్ద ఆలయంగా గుర్తింపు తెచ్చుకుంది. ఆలయ ప్రారంభానికి ఒక రోజు ముందు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని భారతీయులు ఉద్దేశిస్తూ ఫిబ్రవరి 13న అహ్లాన్ మోడీ సమావేశంలో ప్రసంగిస్తారు.




అబుదాబిలోని జాయెద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో ఈ భారీ సమావేశం జరగబోతోంది.

ఇలాంటి మహోత్తర కార్యక్రమానికి విచ్చేస్తున్న భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడి కి ఘనంగా స్వాగతం పలుకుతూ తెలంగాణ కుర్రాడు హిందూవాహిని కార్యకర్త నాగిళ్ల శ్రీకాంత్ గౌడ్ మన త్రివర్ణ పతాకం చూపిస్తూ జైహింద్ జై శ్రీరామ్ నినాదాలతో దుబాయ్ లో స్కైడైవ్ తో సాహసోపేతమైన స్వాగతం పలికారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట టౌన్, వెలుతురు ఫిబ్రవరి11:**
సిద్దిపేట పట్టణం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పలు వివాహాలకు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు పోలీస్ కన్వేన్షన్ హల్ లో జరిగిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుమారుని వివాహానికి వయోల గార్డెన్ లో జరిగిన విద్యార్థి విభాగం మండల



అధ్యక్షుడు గోవిందారం రవి వివాహానికి దేవి గార్డెన్ లో జరిగిన మాజీ సంతోషి మాత దేవాలయం చైర్మన్ కుమారుని నిశ్చితార్థం కు అదేవిదంగా ముదిరాజ్ ఫంక్షన్ హల్ బైరి అంజయ్య మెట్రో గార్డెన్ లలో జరిగిన పలు వివాహలకు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు.

# ఆటో బైక్ ఢీ..

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి...

## కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై అరవింద్...

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి( వెలుతురు న్యూస్):**
ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మోమిన్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది.మోమిన్ పేట్ ఎస్సై అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన బావోజీ ప్రభాకర్ రెడ్డి స్వగ్రామం నుండి పత్తి పైసలు తీసుకురావడం కోసం వెళుతుండగా మార్గమధ్యమంలో కార్తికేయ ఐరన్ ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న (టీఎస్15యు6359) నెంబర్ గల ఆటో ప్రతి వేగంగా జాగ్రత్తగా నడుపుకుంటూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది.సంఘటనలో గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డికి బలమైన గాయాలు అవడంతో ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రభాకర్ రెడ్డి మృతి చెందారని చెప్పారు.మృత్యుని భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరవింద్ తెలిపారు.

# గోడ పోస్టర్ ఆవిష్కరణ..


**మేడిపల్లి, వెలుతురు:**
దేశంలో మోడీ వచ్చిన తర్వాత కార్మికులపై దాడులు మొదలయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణకుమారి, మేడిపల్లి మండల సీపీఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆరోపించారు.. ఆదివారం మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్ చౌరస్తాలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్ ఆధ్వర్యంలో గోడపత్రికలను విడుదల చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నందూరి కరుణకుమారి, రచ్చ కిషన్ లు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను 4 కోడ్ లుగా చేసి కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శలు గుప్పించారు.. రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి మోడీ 700 మంది రైతుల చావుకు కారకుడు అయ్యాడని ఆరోపణలు గుప్పించారు.. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని 12 గంటల పని విధానంగా మారుస్తూ జీవోలు తీసుకు వస్తున్నారని



అన్నారు. కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని 18 డిమాండ్ల పైన ఈ సమ్మె జరుగుతుందని ఆయన తెలిపారు.. ఈ సమ్మెలో కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.. ఈ సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ మండల అధ్యక్షులు భూతం ఐలయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఇందిరా నగర్ శాఖ కార్యదర్శి మాచర్ల కనకయ్య, సీపీఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, వి రామచందర్, వెంకటమ్మ, లక్ష్మి, మణెమ్మ, సుజాత, రమేష్, రజిత, ఎన్. ఆంజనేయులు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు..

# నామకరణ మహెూత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్,వెలుతురు, ఫిబ్రవరి 11:** సంగారెడ్డి జిల్లా నారాయఖేడ్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మల్గొండ తమ్ముని కుమారుని నామకరణ మహెూత్సవంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డివారితోపాటు ఖేడ్ పట్టణ అధ్యక్షులు నగేష్ సెట్, ఆత్మ డైరెక్టర్ ర్యకాల గోపాల్, కల్హేర్ మండల పార్టీ యువత అధ్యక్షులు సంతోష్ కుమార్ యువ నాయకులు జైపాల్,అబ్బు,రమేష్ నాయక్, తదితరులు ఉన్నారు.



# అధికారంలోకి రాగానే హామీలను మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు

## కల్యాణ లక్ష్మి షాదీ ముబారాక్‌కు తులం బంగారంపై బడ్జెట్ లో కేటాయించని ప్రభుత్వం

## బిఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో 13 లక్షల మంది లబ్ధిదారులకు రూ. 12వేలకోట్లు ఇచ్చాం

## రెండు నెలల నుండి వృద్దులకు ఆసరా పెన్షన్ అందలేదు

## వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అందించడం లేదు

**సిద్దిపేట టౌన్, వెలుతురు ఫిబ్రవరి11:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేడు అధికారంలోకి రాగానే మాట మార్చిందని మాజీ మంత్రి సిద్దిపేట హరీశ్ రావు మండిపడ్డారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద లబ్ధిదారులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు చెక్కులను అందజేశారు. ఈ సదర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో పెద్దింటి ఆడపిల్లకు అండగా ఉండేందుకు షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని మాజీ సీఎం కేసిఆర్



ప్రారంభించారని తెలిపారు. పదేళ్ల ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని 13 లక్షల పేదింటి ఆడపిల్లల పెళ్ళిళ్లకు రూ. 12 వేల కోట్లు ఆర్థిక సహాయం అందించామన్నారు. గెలిపిస్తే కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో నిధులు కేటాయించలేదన్నారు. వృద్ధులకు ఆసరా కింద రూ 4 వేలు పెన్షన్ అందిస్తామని అబద్ధాలు చెప్పారని తెలిపారు. 4వేలు



కాదు కదా కనీసం గత రెండు నెలలు జనవరి ఫిబ్రవరికి సంభందించి రూ. 2వేల పెన్షన్ ను ఇంతవరకు చెల్లించలేదని చెప్పారు. వ్యవసాయం సంబంధించి 24 గంటల విద్యుత్ అందిస్తామని చెప్పి కనీసం 16 గంటలు కూడా విద్యుత్ సరఫరా ఇవ్వడం లేదని మండిపడ్డారు విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజనర్సు రవీందర్ రెడ్డి పాల సాయిరాం జాప శ్రీకాంత్ రెడ్డి కొల రమేష్ గౌడ్ కౌన్సిలర్ గ్యాదరి రవీందర్ బిఆర్ఎస్ నాయకులు మొయిజ్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగడి గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్ రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి(వెలుతురు న్యూస్ ):**
వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాండీస్ వ్యాధికి గురై ఇబ్బంది పడుతున్నారని వివిధ వార్త పత్రికలలో వచ్చిన వార్తకు స్పందించిన లితెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ జిల్లా అధికారులతో మాట్లాడి అక్కడ ఏం జరుగుతుంది, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే సమాచారం తెలుసుకోవడం జరిగింది.

అలాగే వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ గారిని, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అర్థ సుధాకర్ రెడ్డి గారిని పాఠశాలకు వెళ్లి అక్కడి పరిస్థితి తెలుసుకోవాలని ఆదేశించారు. దాంతో అక్కడికి వెళ్లిన వారు ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి విద్యార్థినిల ఆరోగ్య



పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

2014లో నిర్మించిన ఈ హాస్టల్ మెయింటెనెన్స్ పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగానే బిల్డింగ్ చాలా పాత బడిందని చైర్ పర్సన్ గారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి నిర్లక్ష్యం జరగదని, ఈ సమస్యను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారి దృష్టికి తీసుకెళ్లి వీలైనంత తొందరగా మరమ్మత్తు పనులు చేపడతామని అన్నారు. ఈ సందర్భంగా హాస్టల్లో పారిశుద్ధ్య సమస్యలను గుర్తించిన చైర్ పర్సన్ స్పెషల్ డ్రైవ్ పెట్టి పారిశుద్ధ్య పనులు వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతానికి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బీసీలపై కపట ప్రేమను నమ్మలేం..

## పూలే విగ్రహంపై కవితమ్మ సానుభూతి విడ్డూరం...

## రేపటి దర్నాను బహిష్కరిస్తున్నాం..

## బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కె. రాజ్ కుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి(వెలుతురు న్యూస్):**
బీఆర్ఎస్ పార్టీ నాయకులు,ఎమ్మెల్సీ కవిత చూపిస్తున్న కపట ప్రేమను ఎవ్వరు నమ్మే స్థితిలో లేరని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు తాండూరు నియోజకవర్గ కన్వినర్ కందుకూరి రాజ్ కుమార్ అన్నారు.అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటు కోసం దర్నా చౌక్ వద్ద ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చిన దర్నాను బీసీ సంఘం బహిష్కరిస్తుందని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 9 ఏండ్లు పాలించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు బీసీలపై చూపిస్తున్న ప్రేమ ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. ఇన్నాళ్లు పూలే విగ్రహ ఏర్పాటు ఆలచోన ఎందుకు రాలేదని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించలేదు కాని ఇప్పుడు బీసీలపై ప్రేమ చూపిస్తే నమ్మె స్థితిలో ఎవ్వరు లేరన్నారు. ప్రజాస్వామ్యంలో గళాన్ని వినిపించేందుకు వేధికగా ఉన్న దర్నా చౌక్ ను ఎత్తేసి ఇప్పుడు అదే దర్నా చౌక్ వద్ద ఎమ్మెల్సీ కవిత పూలే విగ్రహం ఏర్పాటు కోసం దర్నా చేపట్టడం





విడ్డూరంగా ఉందన్నారు. బీసీలపై కపట ప్రేమ చూపించే ఈ దర్నాను బీసీలందరు బహిష్కరిస్తున్నారని అన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, అలాంటి వారికి మద్దతు ఎప్పుడు ఉండదన్నారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో మా పోరాటాని సాగించుకుంటామన్నారు. హక్కులను సాధించు కుంటామని అన్నారు.



# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు విస్మరిస్తున్న దళిత, బహుజన, మైనార్టీలు

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి ఫలితమే ఉపకార వేతనాలు, ఉద్యోగాలు


## అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,నత్తి మైసయ్య

**బోడుప్పల్, వెలుతురు:**
మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించే కార్యక్రమం ప్రతి ఆదివారం ఘనంగా నిర్వహించడం జరుగుతుంది.ఈ ఆదివారంతో జ్ఞానమాల కార్యక్రమం 260 ఆదివారాలు విజయ వంతంగా పూర్తి చేసుకుంది.ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి ఫలితంగానే ఎస్సీ, ఎస్టి ,బీసీ,మైనార్టీలు రిజర్వేషన్లు పొంది ఉద్యోగాలు, ఉపకార వేతనాలు,ప్రభుత్వ పథకాలు అనుభవిస్తున్నారు,కానీ రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలను మాత్రం విస్మరిస్తున్నారు. ఈ క్రమంలో రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు చదవాలని, అంబేద్కర్ చిత్రపటం ప్రతి ఇంట్లో ఉండాలని ప్రజలలో అవగాహన కల్పిస్తూ అంబేద్కర్ ఆశయ సాధన సంఘం అంబేద్కర్ ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చడానికి నడుము కట్టిందని, ముఖ్యంగా రిజర్వేషన్లు అనుభవిస్తున్న వారు అంబేద్కర్ నిత్యం స్మరించుకోవాలని నత్తి మైసయ్య అన్నారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు రాపోలు శ్రీరాములు,జి యాకయ్య, నత్తి విజయ్, అంజయ్య,కొంపెల్లి నరేష్,ఈతకోట గోపాలకృష్ణ, కంచి సతీష్,సవరపు బయన్న బసూర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా కలప తరలిస్తున్న రెండు డీసీఎంలను పట్టుకున్న సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**సిద్దిపేట రూరల్ , వెలుతురు ఫిబ్రవరి11:**
తేదీ: 10-02-2024 రాత్రి 8 గంటల సమయంలో సిద్దిపేట రూరల్ మండలం బండ్ల చర్లపల్లి గ్రామ శివారులో రెండు డీసీఎంలలో అక్రమంగా కలపలిస్తున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బంది కలిసి వెళ్లి పట్టుకొని సిద్దిపేట రూరల్ పోలీసులకు అప్పగించగా వారు పూర్తి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటారు. డీసీఎం నెంబర్ TS12UD-1969 TS12UC-6155 డీసీఎం నడుపుతున్న డ్రైవర్ల వివరాలు 1. మంగళారపు కనకయ్య తండ్రి హమ్మయ్య, వయస్సు 40 సంవత్సరాలు. 2. ఆంజనేయులు తండ్రి రాజమల్లు వయస్సు 26 సంవత్సరాలు. ఇరువురి గ్రామం బండ్ల చర్లపల్లి, మండలం సిద్దిపేట రూరల్. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు లక్ష్యం




భావితరాలు బాగుపడాలనే అడవుల పచ్చదనం పెంచే చెట్లను ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా నరికి కలపను అమ్ముకునే వారిపై, ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా చేసిన మరియు పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటువంటి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667447, 8712667446, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఐక్యమత్యంగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ సాధిద్దాం..

## చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామెన భీం భరత్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం చించల్ పేట్, చిట్టిగిద్ద, మీనేపల్లికాలన్గంగ్యాడ గ్రామాలకు చెందిన బిఆర్ఎస్, బీజేపీ నాయకులు,కార్యకర్తలు నవాబ్ పేట్ మండలాధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గణపురం ప్రసాద్,వర్కింగ్ ప్రెసిడెంట్స్ సామా వెంకటరెడ్డి, కొండల్ యాదవ్,ఎంపీటీసీ ఎక్బాల్,మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో బిజెపి,బిఆర్ఎస్ రెండు పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు సుమారు100 మంది కాంగ్రెస్‌లో చేరారు.ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి భీం భరత్ వారికి పార్టీ కండువాకప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాల మోసపూరిత హామీలతో ప్రజలు విసిగి పోయారని,అభివృద్ధి జరగానే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని అన్నారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యే దిశగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. ప్రతి



కాంగ్రెస్ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అధిష్టానం దృష్టికి తమ సమస్యను తీసుకువస్తే పరిష్కరించే విధంగా కృషి చేస్తామనితెలిపారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో బీజేపీ నాయకులు సాయికుమార్, మాజీ ఎంపీటీసీ నారేగూడెం పాండురంగరెడ్డి,కొండ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి,కమల్,వెంకటేశం, శ్రీశైలం, నర్సిములు,వంశిరాజ్,శివకుమార్,రాజు,మొగులయ్య,బాలరాజ్ , శ్రీను,రాజు, యేసయ్య, కృష్ణ,బాలరాజ్,రమేష్, శ్రీనివాస్, యాదయ్య. మహ్మదాన్ పల్లి గ్రామంనుండి మాజీ సర్పంచ్



గోపాల్,గేట్ వనం పల్లి నుండి మాజీ సర్పంచ్ వేమారెడ్డి, మీనేపల్లి కలాన్ నుండి మాజీ సర్పంచ్ పెంటయ్య,గంగ్యాడ గ్రామం నుండి మాజీ సర్పంచ్ హరికృష్ణ రెడ్డి.చిట్టిగిద్ద నుండి నర్సింలు,బీజేపీ పార్టీ నుండి లింగంపల్లి గ్రామస్తులు మాజీ సొసైటీ డైరెక్టర్ పాండురంగ రెడ్డి,నాగిరెడ్డిపల్లి నుండి శేఖర్ యాదవ్ తదితరులు కాంగ్రెస్ లో చేరారు.



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:** తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా కమర్థపు మురళి గారి ప్రమాణ స్వీకార అనంతరం నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలపడానికి తెలంగాణ పద్మశాలి భవన్ కు విచ్చేసిన సందర్భంగా తుమ్మల గారికి పుష్పగుచ్చం అందించడం జరిగింది

## గాం చలో గర్ చలో అభియాన్ కార్యక్రమం

**చౌటుప్పల్ వెలుతురు ఫిబ్రవరి 11:** గాం చలో గర్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారము యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామంలో గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద ప్రజలకు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాల గురించి గ్రామంలోని కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కలవడం జరిగింది అలాగే గ్రామంలోని విద్యావంతులను రైతులను మహిళలను యువకులను కలవడం జరిగినది అలాగే





బిజెపి సీనియర్ నాయకుడు మన్నె ప్రతాప రెడ్డి గారిని ఆరెగూడెం గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి ఆరెగూడెం ప్రవాసి ఉడుగు యాదయ్య గౌడ్ సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో మునగాల తిరుపతి రెడ్డి గారు కట్ట కృష్ణ బూతు అధ్యక్షుడు అనంతుల ఐలయ్య మునగాల విజయేందర్ రెడ్డి ఉయ్యాల లింగస్వామి బోయ నరసింహ ఉయ్యాల పరమేశ బద్దం రాజయ్య తదితరులు పాల్గొన్నారు

## అయోధ్య బాలరాముని దర్శనం జయప్రదంగా జరగాలి

**రాజేంద్రనగర్ వెలుతురు ఫిబ్రవరి 11:**

జైశ్రీరామ్ ఆదివారం రోజున చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో రాజేంద్రనగర్ అసెంబ్లీ నుండి “”అయోధ్య””” రామ మందిరానికి బయలుదేరుతున్న భక్తులు ఆ బాల రాముని దర్శనం జయప్రదంగా జరగాలని కోరుకుంటూ వారికి ఘనంగా పంపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బొక్క నరసింహ రెడ్డి బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, వై శ్రీధర్, మల్లారెడ్డి, బొక్క బాల్ రెడ్డి, కొమురయ్య, బాబురావు రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు, విజయ్ అత్తాపూర్



డివిజన్ అధ్యక్షులు బాలకృష్ణ, వేణు, వాసు, శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్, వెంకటేష్, ముఖేష్, జగన్, రాజ్ పాల్ రెడ్డి, మరియు రామభక్తులు తదితరులు పాల్గొన్నారు.జైశ్రీరామ్ ఆదివారం రోజున చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో రాజేందర్ నగర్ అసెంబ్లీ నుండి “”అయోధ్య””” రామ మందిరానికి బయలుదేరుతున్న భక్తులు ఆ బాల రాముని దర్శనం జయప్రదంగా జరగాలని కోరుకుంటూ వారికి ఘనంగా పంపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బొక్క నరసింహ రెడ్డి బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, వై శ్రీధర్, మల్లారెడ్డి, బొక్క బాల్ రెడ్డి, కొమురయ్య, బాబురావు రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు, విజయ్ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు బాలకృష్ణ, వేణు, వాసు, శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్, వెంకటేష్, ముఖేష్, జగన్, రాజ్ పాల్ రెడ్డి, మరియు రామభక్తులు తదితరులు పాల్గొన్నారు.





# శిధిలావస్థలో ఉన్న చెరువులకు మరమ్మతులు చెప్పట్టాలి

**చెరువులలో పుష్కలంగా నీళ్ళున్నా నిరూపయోగం**

**చెరువులకు మరమ్మతులు చెప్పట్టి రైతులను ఆదుకోవాలి**

**ఝరాసంగం మండలం మేదపల్లి గ్రామ రైతుల డిమాండ్**

**జహీరాబాద్, 11 ఫిబ్రవరి వెలుతురు :** రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ప్రతి ఏటా వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులు కుంటలు నీటితో నిండుకుంటున్నాయి. కానీ నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు అవస్థ లకు గురవుతున్నారు. సంగారెడ్డి జిల్లా ఝరా సంఘం మండలం వ్యాప్తంగా ఏడా కులపల్లిలో కొత్తూరు వాగు, రాళ్ళ వాగు చెరువు, మేదపల్లి శివారులో గుండం చెరువు, ఏనుగుల చెరువు, ఈదులపల్లిలో కప్పలగా వాగు చెరువు, రాచన్న వాగు చెరువు, గంగాపూర్ లో ఒక్క చెరువులు ఉన్నాయి. ఆయా చెరువులు కింద సుమారు 2 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంటుందనీ అధికారుల లెక్కలు ఉన్నాయి. కానీ వాటి తూములు, సీసీ కాలువలు శిధిలావస్థకు చేరడంతో కనీసం 2 వందల ఎకరాలు కూడా నీరు చేరడం లేదని, పుష్కలమైన నీటి వనరులు ఉన్నప్పటికీ రైతులు పండించే వివిధ రకాల పంటలకు నీరు అందకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. నిరూపయోగంగా ఉన్న చెరువులకు మరమ్మ తులు చెప్పట్టి చుట్టుపక్కల ఉన్న వేల ఎకరాలకు నీరందించి, రైతులను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# బీఆర్ఎస్ నాయకులకి మహిళలు అంటే ఎంత గౌరవమో...

**మహిళలకి ఉచిత బస్సు సౌకర్యం చాలా మేలు చేస్తుంది**

**సొంతింటి పంచాయితీ తీర్చి పక్కింటి పంచాయితీకి వెళ్తే బాగుంటుంది**

**బీజేపీ నాయకురాలు జ్యోతి పండాల్**

**జహీరాబాద్, 11 ఫిబ్రవరి, వెలుతురు :** బీ ఆర్ ఎస్ నాయకులు ఎప్పుడు చూసినా మహిళల మీదే ఏడుస్తూ ఉంటారని, వారి ప్రభుత్వ హయాంలో మహిళలకి చేసింది ఏమీ లేదు వేరే వాళ్ళు చేస్తుంటే కూడా వాళ్ళకి కళ్ళు ఒరవవు అని బీజేపీ నాయకురాలు జ్యోతి పండాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకి ఉచిత బస్సు సౌకర్యం చాలా మేలు చేస్తుంది ఎందుకంటే ఈ మధ్య కాలంలో నేను హైదరాబాద్ లో గల ఒక కాలేజీని సందర్శించినప్పుడు చాలా మంది విద్యార్థినిలు కరోనా వల్ల తల్లినో తండ్రి నో కోల్పోయి ఉన్నారు వాలు కాలేజ్ ఫీజ్ కూడా కట్టుకోలెని పరిస్థితి ఉంటే కాలేజీ ప్రొఫెసర్లే వాళ్ళ ఖర్చులని భరిస్తున్నారని ఆ కాలేజ్ ప్రిన్సిపల్ చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. అంటే ఇలా వాళ్ళ చదువుకి కూడా కర్చు పెట్టు కోలేని అమ్మాయిలకి ఉచిత బస్సు సౌకర్యం చాలా మేలుచేస్తుంది అన్న విషయం గమనించాలని వారన్నారు. ఇలా అన్ని వర్గాల మహిళలకి మేలు చేస్తున్న ఈ చిన్న పాటి ఆధారం కూడా లేకుండా చేయాలని చూస్తున్న వారి వంకర బుద్ధిని చూస్తే మహిళల పట్ల వారికి ఉన్న గౌరవం ఎంటో అని అర్థమవుతుంది అని జ్యోతి పండాల్ వ్యాఖ్యానించారు. మన సౌమ్యుడైన ఎమ్మెల్యే ఇక్కడ ఉన్న సమస్యలని తీర్చ కుండ రాష్ట్ర సమస్యల మీద పోరాడుతుంటే చాలా హాస్యాస్పదంగా ఉందని జ్యోతి పండాల్ ఏద్దేవా చేశారు. ముందు సొంతింటి పంచాయితీ తీర్చి పక్కింటి పంచాయితీకి వెళ్తే బాగుంటుందని జ్యోతి పండాల్ హితవుపలికారు.



# యువకులను అద్భుత క్రికెటర్లుగా తీర్చిదిద్దాలి

**ఎమ్మెస్ కే ప్రసాద్ వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముజీబ్**

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 11:** ఆదివారం రోజున ఎమ్మెస్ కే ప్రసాద్ వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, ఉద్యమకారుడు సేవారత్న డాక్టర్.ఎస్. ఎం.హుస్సేని (ముజీబ్) గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో డాక్టర్ ముజీబ్ గారు మాట్లాడుతూ యుక్త వయసులో తాను క్రికెట్ ఆట పోటీల్లో పాల్గొన్నానని, మంచి బ్యాట్స్మెన్‌గా తమ జట్టులో పేరు సంపాదించుకున్నారని, తన చిన్ననాటి గుర్తులు తెలియజేశారు. అలాగే ఎమ్మెస్ కే ప్రసాద్ గారి ఆధ్వర్యంలో క్రికెట్, ఆటలు నేర్చుకుంటున్న యువకులకు మంచి భవిష్యత్తు రానున్న రోజులో ఉంటుందని, ఇటు రాష్ట్రానికి అటు భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన ఎమ్మెస్ కే









# వికారాబాద్ యశోద హాస్పటల్ సిబ్బందితో ఈషా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..

**ఈషా హాస్పిటల్ వ్యవస్థాపకులు జగ్గారి భరత్ రెడ్డి, డాక్టర్ విశ్వతేజ్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి( వేలుతురు న్యూస్):** వికారాబాద్ పట్టణ పరిధిలోని ఈశా హాస్పిటల్ ఎండి జగ్గరి భరత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ వారి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా గుండె, మెదడు,నరాలు,జీర్ణాశయ వ్యాధులు,గైకాలజీ, ఊపిరితిత్తులు, ఎముకలు,ఆంకాలజీ,సాధారణ వ్యాధులు,పీడియాట్రిక్స్,జనరల్ సర్జరీ సంబందించిన టెస్టులు చేశారు.ఈ ఉచిత వైద్య శిబిరం సుమారుగా 245మందికి పైగా పేషెంట్లు హాజరు కాగా వారికి అత్యంత కార్పొరేట్ స్థాయి చికిత్స అందించి వారికి కావలసిన టెస్టులు చేసి ఫ్రీ మెడిసిన్స్ అందించడం జరిగిందని ఈశా




హాస్పిటల్ ఎండి భరత్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈశ హాస్పిటల్ పేరుతో నిరుపేద ప్రజలకు అత్యంత కార్పొరేట్ స్థాయి చికిత్సను సామాన్య ప్రజలకు అందించి వారిని సేవ్ చేయడమే మా ఈశా హాస్పిటల్ ముఖ్య ఉద్దేశమని,అందుకే ఇంత అత్యంత ఖరీదైన సూపర్ స్పెషాలిటీ యశోద హాస్పిటల్ డాక్టర్లు,సిబ్బంది,మా హాస్పిటల్ డాక్టర్లు సిబ్బందితో ఈ యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఇందులో 245 మందికి పైగా పేషెంట్స్ పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో యశోద హైటెక్ సిటీ బ్రాంచ్ డైరెక్టర్ డా.హర్షిత్, డా.గోపి,డా.వినయ్,డా.కుమార్, డా.సాగరి,డా. సత్యనారాయణ పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com